క్లుప్తంగా

విద్యకు అధిక ప్రాధాన్యం



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని సర్పంచ్ పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సొంత నిధులతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరుముద్దలో భాగంగా కొత్తగా రాగిజావ అందించడం గొప్ప నిర్ణయమన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం.పూర్ణయ్య, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ షేక్ సత్తార్, హెచ్ఎం కరీముల్లా, వార్డు సభ్యురాలు ఫాతిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాములూరులో సిలువ మార్గం



నందిగామ: మండలంలోని దాములూరు గ్రామంలో మంగళవారం సిలువ మార్గం నిర్వహించారు. తపస్సు కాలం నేపథ్యంలో సిలువ గిరి విచారణ గురువు ఫిలోమిన్ రాజు పర్యవేక్షణలో సిలువ మార్గం జరిగింది. ఆర్‌సీఎం సంఘస్తులు, క్రీస్తు మాలధారులు క్రీస్తు పాటలను ధ్యానిస్తూ గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో సిలువను మోస్తూ పర్యటించారు. కార్యక్రమంలో దైవ సేవకులు ఏసు రాజు, జార్జి, రాంబాబు, పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొన్నారు.

ఉక్కు కళావేదిక వేలం వాయిదా

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఉక్కు కళా వేదికలో నిర్వహించే కార్యక్రమాలకు అద్దె వసూలు చేసుకొను హక్కుకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ చదవోలు నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు.

అవినీతికి తావులేని పారదర్శక పాలన



ముప్పాళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని ముప్పాళ్లలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వాటికి సంబంధించిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే కాకుండా అగ్రవర్ణ మహిళలకు సైతం మేలు చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సమర్థంగా అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే విస్మరించినట్లుగా.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీలను విస్మరించలేదని తెలిపారు. చెప్పాడంటే చేస్తాడంతే అనేంతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, పీఏసీఎస్ ఛైర్మన్ నల్లాని అయ్యన్న, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, బండారుపల్లి కపిల్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: ఇళ్లు, ఇళ్ల స్థలం లేనివారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైతే మంజూరు చేస్తోందని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పరిటాల గ్రామంలో ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నివర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని మహిళలు కోరారు. దీనిపై ఎమ్మెల్యే త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచి యద్దనపూడి ఆనందజోత్స్న, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు మార్త శ్రీనివాసరావు, యద్దనపూడి విజయారావు, కర్ల రామకృష్ణ, వేముల నాగరాజు, వేముల జీవరాజు, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతో జాతీయ రహదారి విస్తరణ



భూముల లేఅవుట్‌లను పరిశీలిస్తున్న జేసీ

నందిగామ: జాతీయ రహదారి విస్తరణ పనులకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూములను సేకరించడానికి జాయింట్ కలెక్టర్ మంగళవారం నందిగామ మండలంలో పర్యటించారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని అంబారుపేట సమీపంలో అవసరమైన భూములు సేకరించడానికి, మార్కెట్ ధరను నిర్ధారించేందుకు భూములను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించాల్సిన భూమి వివరాలు, సంబంధిత భూముల మార్కెట్ ధరలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ముఖ్యంగా ఏ ఒక్క రైతుకూ నష్టం కలగకుండా మార్కెట్ ధరను నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం



జగ్గయ్యపేట అర్బన్: కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ చదవోలు నాగమల్లేశ్వరరావును మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నేతలు, ఎస్సీ, ఎస్టీ నాయకులు కలిశారు. పట్టణంలోని పలు సమస్యలపై వారు కమిషనర్‌కు వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూమాటి కృష్ణ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు దేవరకొండ శ్రీను, ఉద్దంటి వాసు, న్యాయవాది పారా రామారావు, రెబ్బ పుల్లారావు, సూర్య వెంకట్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రిక్స్ మిషన్‌లో పడి వ్యక్తి మృతి

ముక్త్యాల(జగ్గయ్యపేట): ప్రమాదవశాత్తు బ్రిక్స్ మిషన్‌లో పడి యువకుడు మృతి చెందిన ఘటన గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామ సమీపంలోని సిమెంట్ కర్మాగారంలో బ్రిక్స్ ప్లాంట్‌లో వత్సవాయి మండలం తాళ్లూరు గ్రామానికి ఉమ్మినేని నవీన్ (35) పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగానే సాయంత్రం సమయంలో విధులకు వచ్చాడు. అయితే ప్రమాదవశాత్తు మిషన్‌లో పడటంతో తలకు తీవ్ర గాయాలవటంతో హుటాహుటిన సిబ్బంది పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వయ్యారిభామ' అత్యంత ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, తదితరులు

పెనుగంచిప్రోలు: వయ్యారిభామ మొక్క అత్యంత ప్రమాదకరమని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. వయ్యారి భామ మొక్కల నిర్మూలనకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య, పొలాల్లో ఎక్కడ పడితే అక్కడ కనిపించే వయ్యారి భామ మొక్కలతో పంటలకు, మనుషులతో పాటు పశువులకు కూడా అనేక రకాల వ్యాధులు వస్తాయన్నారు. ఏఓ రామసుబ్బారెడ్డి, పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ మనుషులకు ఎలర్జీ, ఆస్తమా, ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. వయ్యారిభామ తిన్న పశువుల పాలు తాగితే జ్ఞాపకశక్తి దెబ్బతింటుందని తెలిపారు. అమెరికా నుంచి మన దేశానికి వచ్చిన ఈ మొక్క గింజలు ఎన్నో నష్టాలను కలిగిస్తున్నాయన్నారు. అందరూ కలిసి ఈ మొక్కల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజన, మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వ్యవసాయ సహాయక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామాల్లో కలుపు మొక్కల నిర్మూలనలో భాగంగా వయ్యారిభామను స్పెషల్ డ్రైవ్ ద్వారా తరిమికొట్టాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో మాధవశర్మ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కలుపు మొక్కల నిర్మూలనపై పంచాయతీ, వ్యవసాయ, వైద్య, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీవో సుబ్బారావు, వ్యవసాయాధికారి వరలక్ష్మి, పశువైద్యాధికారి ప్రసన్న, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి అధ్యాపకులతో కేవీఆర్ కాలేజీ పూర్వ విద్యార్థులు

నందిగామ: పూర్వ విద్యార్థుల కలయికకు మంగళవారం పట్టణంలోని ఉపాధ్యాయుల (ఏపీటీఎఫ్) భవనం వేదికగా మారింది. పట్టణంలోని కె.వి.ఆర్ కళాశాలలో 1990–93 వరకు డిగ్రీ (బీఎస్సీ సీబీజెడ్) చదివిన విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలిశారు. నాడు పాఠాలు బోధించిన పలువురు అధ్యాపకులను ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఒకే వేదికపై కలుసుకున్న వారందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

ప్రభుత్వాస్పత్రికి ఆక్సిజన్ సిలిండర్ల వితరణ



ఆక్సిజన్ సిలిండర్లను అందజేస్తున్న 'అల్ట్రాటెక్' ప్రతినిధులు

బూదవరం(జగ్గయ్యపేట): దేశ వ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసుల దృష్ట్యా ముందు చూపుతో అల్ట్రాటెక్ సిమెంట్స్ యాజమాన్యం వ్యవహరిస్తోందని కర్మాగారం హెచ్‌ఆర్ హెడ్ సతీష్ పేర్కొన్నారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కర్మాగారం వితరణతో 10 ఆక్సిజన్ సిలిండర్లను మంగళవారం వైద్యాధికారి అనిల్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో యాజమాన్యం తరఫున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్, కర్మాగారం సిబ్బంది పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల్లో నాణ్యత పాటించాలి

జయంతి(వీరులపాడు): ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య పేర్కొన్నారు. జయంతి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ జంగా కోటిరెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ కిరణ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పొంగలి షెడ్లలో గ్యాస్ పొయ్యిలకు మరమ్మతులు చేయండి



తనిఖీలు చేస్తున్న ఈఓ లీలాకుమార్

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ భక్తులు పాలు పొంగళ్లు చేసేందుకు ఏర్పాటు చేసిన షెడ్లలో గ్యాస్ పొయ్యిలకు మరమ్మతులు చేయాలని ఈఓ లీలాకుమార్ ఆలయ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం సిబ్బందితో కలిసి పొంగళ్ల షెడ్లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు గ్యాస్ పొయ్యిలకు మరమ్మతులు చేయించాలని కోరడంతో ఈఓ వెంటనే స్పందించారు. కార్యక్రమంలో ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా



ప్రమాదానికి గురైన ట్రాక్టర్

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పసుపులేటి హనుమంతరావు ట్రక్‌లో సిమెంట్ రాళ్ల లోడుతో వెళ్తున్నాడు. ఇంతలో ఎదురుగా లారీ రావటంతో ట్రాక్టర్ బ్రేక్ కొట్టడంతో అదుపు తప్పి ట్రక్‌తో సహా రోడ్డు పక్కన గుంతలో బోల్తా కొట్టింది. ఘటనలో హనుమంతరావు పక్కకు పడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. జేసీబీ సాయంతో ట్రాక్టర్, ట్రక్‌ను పైకి తీశారు. సంఘటనా స్థలాన్ని ఎంపీపీ మార్కపూడి గాంధీ, సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు పరిశీలించారు.

చివరకు ధర్మమే గెలుస్తుంది

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కాకుండా రాక్షస మనస్తత్వం కలిగిన చంద్రబాబు ప్రయత్నాలు అనేకం చేస్తున్నారని, చివరకు ధర్మమే గెలుస్తుందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహించిన చండీహోమం, వసంత నవరాత్రోత్సవాల విశేష పుష్పార్చనలో కుటుంబ సమేతంగా మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ పాల్గొన్నారు. అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మంత్రికి ఆలయ ఈవో భ్రమరాంబ, చైర్మన్ కర్నాటి రాంబాబులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. చండీహోమం, విశేష పుష్పార్చన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని చండీహోమం నిర్వహించామన్నారు. రాష్ట్రంలో నడుస్తున్న సంక్షేమ రాజ్యం ఇలాగే కొనసాగాలని, అమ్మవారిని వేడుకున్నానన్నారు. లోక కళ్యాణార్థం జరిగే యాగాలను రాక్షసులు ఎలా అడ్డుకున్నారో జగన్ సంక్షేమ పథకాలు అమలు కాకుండా ఉండాలని చంద్రబాబునాయుడు అనేక ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. ధర్మాన్ని పాడుచేయాలని చూసే వారు మరింత పాతాళానికి పోతారన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పినా చంద్రబాబునాయుడు మనస్తత్వం మారలేదన్నారు. ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన చంద్రబాబునాయుడు ఇంకా దుర్మార్గపు మార్గంలోనే వెళ్లాలనే భావనతో ఉన్నారన్నారు.

రాష్ట్రంలో డిజిటల్ గ్రంథాలయాలు

ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు



మాట్లాడుతున్న శేషగిరిరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేశామని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో రాష్ట్రంలోని గ్రంథాలయ అధికారులతో మంగళవారం పుస్తకాల కొనుగోలు, డిజిటల్ గ్రంథాలయాల ఏర్పాటు బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో శేషగిరిరావు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలనే సీఎం ఆలోచనలకు అనుగుణంగా రూ.450 కోట్లతో 10,960 డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కడపలో మొదటి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఏప్రిల్ 5 నుంచి విజనరీ జగన్ పేరుతో సెమినార్‌లు నిర్వహిస్తున్నామన్నారు. గత సంవత్సరం బడ్జెట్‌లో రాష్ట్రంలో గ్రంథాలయాల్లో పుస్తకాల కొనుగోలుకు రూ.15.75 కోట్లు కేటాయించామన్నారు. సామాజిక, విజ్ఞాన విషయాలకు సంబంధించి కొత్తగా ప్రచురించిన పుస్తకాల నమూనా ప్రతులను రచయితలు, ప్రచురణ కర్తల నుంచి కోరుతున్నామని తెలిపారు.

రెరా చట్టంపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) విజయవాడ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని మున్సిపల్ వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలతో మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన రెరా సభ్యులు రెరా చట్టం, ఏపీ నియంత్రణ ప్రాధికార సంస్థ నియమావళి–2017 గురించి వారికి అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగంలో బిల్డర్లను నియంత్రించేందుకు అన్ని రాష్ట్రాలలో అమలయ్యే విధంగా రెరా చట్టం తీసుకువచ్చారని తెలిపారు. మన రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం నియంత్రణ ఎలా జరుగుతుందో రెరా సభ్యుడు చందు సాంబశివరావు వివరించారు.

'ఆయుష్'లో అరుదైన పక్కటెముకల సర్జరీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో పక్కటెముకలు విరిగి, ప్రాణాపాయస్థితిలో ఉన్న యువకుడికి ఆయుష్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయుష్ కార్డియో థొరాసిక్ సర్జన్స్ డాక్టర్ కంఠమనేని శ్రీనివాస్ సాయి, డాక్టర్ అన్నే సాయిపవన్ మాట్లాడుతూ వీఏటీఎస్ అనేది ఒక చిన్న ఓపెన్ సర్జరీ అని, కణజాలాల, అవయవాలను నియంత్రించడానికి కొన్ని ప్రత్యేక పరికరాలను ఉపయోగించడం ద్వారా ఈ సర్జరీ చేశారన్నారు. వీడియో అసిస్టెడ్ థొరాకోస్కోపిక్ సర్జరీ(వీఏటీఎస్)లో శిక్షణ పొందిన కార్డియో థొరాసిక్ సర్జన్ల బృందం ఓపెన్ రిడక్షన్ అండ్ ఇంటర్నల్ ఫిక్సేషన్ విధానంలో శస్త్ర చికిత్స చేసి టైటానియమ్ స్క్రూలు, ప్లేట్స్ ఉపయోగించి విరిగిన పక్కటెముకలను సరిచేయగా, ప్రస్తుతం రోగి పూర్తిగాకోలుకుని తన పనులు తాను చేసుకుంటున్నట్లు వారు తెలిపారు. నగరంలోనే మొదటి సారిగా విజయవంతంగా దీనిని నిర్వహించినట్లు తెలిపారు. ఆరు నెలల కిందట సర్జరీ చేయగా, అప్పటి నుంచి ఫాలోఅప్‌లో ఉన్నాడని వివరించారు. సమావేశంలో ఎనస్థీషియన్‌లు డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు, డాక్టర్ ఎం.సాయికృష్ణ పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షల షెడ్యూల్ ఇదే

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో చదువుతున్న లైబ్రరీ సైన్స్ ఒకటో సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైందని వర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. అజంతకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజును ఆన్‌లైన్‌లో వచ్చేనెల 10వ తేదీ లోపు, రూ.500 అపరాధ రుసుంతో వచ్చేనెల 15లోపు చెల్లించాలని సూచించారు.

రాములోరి కల్యాణానికి ఆలయాల ముస్తాబు



వత్సవాయి: శ్రీరామ నవమి వేడుకలకు మండలంలోని రామాలయాలు ముస్తాబవుతున్నాయి. మక్కపేట, గోపినేనిపాలెం, మంగొల్లు, భీమవరం, వత్సవాయి, కంభంపాడు, పోలంపల్లి, వేములనర్వ తదితర గ్రామాల్లోని ఆలయాలను రంగులతో తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు వేస్తున్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జుజ్జూరు(వీరులపాడు): మహిళా పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. జుజ్జూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కులను ఆయన మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీ చేస్తానన్న చంద్రబాబు మాట తప్పారని గుర్తు చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటూ ఎన్నికల సమయానికి ఉన్న రుణాలను దఫాల వారీగా వారి ఖాతాల్లో జమ చేస్తూ ఆ సంఘాలకు పూర్వ వైభవం తీసుకువచ్చారని తెలిపారు. మహిళలు, రైతు ద్రోహిగా చంద్రబాబు.. చరిత్రలో నిలిచిపోగా.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం రైతు బాంధవుడిగా, మహిళా పక్షపాతిగా ప్రజా హృదయాల్లో నిలిచారని తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల పరిధిలోని 1,055 డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ. 7.74 కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ కోటేరు మల్లీశ్వరీ, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, పీడీ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, సర్పంచ్‌లు రమావత్ కోటి, షోడగిరి రాజశ్రీ, బందెల రాణి, మారపాక మహాలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కర్ల స్వాతి, ఏపీఎం సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరులో మహిళలతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ధనంబోడులో తాగునీటి సమస్యకు పరిష్కారం

- జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘువేంద్ర
- రూ. 12 లక్షల వ్యయ అంచనాతో పైపులైన్లు

జగ్గయ్యపేట అర్బన్: ధనంబోడు కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘువేంద్ర తెలిపారు. దీర్ఘకాలంగా పైపులైన్లు లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్న ధనంబోడు కాలనీలో రూ.12 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన పైపులైన్ల నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లతో కలిసి చైర్మన్ రాఘువేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు ఇటీవల అక్కడ జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి వారి సమస్యను తీసుకువచ్చారు. దీంతో ఉదయభాను ఆదేశాలతో మున్సిపల్ చైర్మన్ 1200 మీటర్ల మేర నాలుగు అంగుళాల పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. వీటితో శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. పట్టణంలో పరిష్కారం కాని సమస్యలపై కూడా దృష్టి పెడతామన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, డీఈ శివకోటేశ్వరరావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



పైపులైన్ల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘువేంద్ర తదితరులు

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

నందిగామ: మునిసిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. నందిగామ మునిసిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సహకారంతో పారిశుధ్యం మెరుగుపరుచుకోవచ్చని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వార్డులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

కాల్వలు శుభ్రం

కంచికచర్ల: డ్రెయిన్లను శుభ్రం చేయిస్తున్నామని సర్పంచి బొక్కా రవికుమార్ అన్నారు. గండేపల్లి గ్రామంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించే కార్యక్రమం చేశారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధుల్లో కల్వర్టు నిర్మాణం చేపట్టామని మురుగు పారుదలకు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కాల్వల్లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామని, దోమలు వ్యాపించకుండా పిచికారి చేస్తున్నామన్నారు. తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరుగా రెండు ప్లాస్టిక్ డబ్బాల్లో వేసి క్లాప్ మిత్రలు తీసుకువచ్చే రిక్షాలో వేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు కానుకల లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలోని కానుకల లెక్కింపు బుధవారం జరుగుతుందని ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు మంగళవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి లెక్కింపు జరుగుతుందని ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

కంచికచర్ల : ఒలింపియాడ్ ఫలితాల్లో కంచికచర్ల చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనపర్చి బంగారు, ల్యాప్‌టాప్‌లు, మరెన్నో విలువైన బహుమతులు గెలుచుకున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఇన్‌స్టో రెండవ స్థాయి పరీక్ష నిర్వహించగా 128 మంది విద్యార్థులు రాశారన్నారు. తమ స్కూల్‌కు చెందిన 119మంది విద్యార్థులు ప్రతిభ కనపర్చి 59 బంగారు పతకాలు, ల్యాప్‌టాప్‌లు గెలుచుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా 3,4,5 స్థానాల్లో గెలిచిన నాగబింద్ర, బ్రాహ్మణి, షణ్ముఖసాయిను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒలింపియాడ్‌లో సత్తా చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు

నిద్రిస్తున్న వారి నుంచి నగదు అపహరణ

నందిగామ: కారులో ఆదమరిచి నిద్రిస్తున్న వ్యక్తుల వద్ద నగదు చోరీకి గురైన ఘటన నందిగామ పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ సతీష్ తెలిపిన సమాచారం ప్రకారం నిజామాబాద్ నుంచి ఓ వాహనంలో ఐదుగురు తణుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై నందిగామ సమీపంలో ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు నిద్ర వచ్చింది. కారును పక్కనే నిలిపి లోపల ఉన్న వారు నిద్రిస్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వారి జేబులోని రూ.85 వేల నగదు అపహరించారు. నిద్రలేచి చూసుకున్న బాధితులు నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.